


పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: కలెక్టర్

సూళ్లూరుపేట : ఈనెల 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేసి ఈనెల 12న పిఒలకు, ఎపిఒలకు పోలింగ్ మెటీరియల్ అందించడం, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరచడం వంటివి జాగ్రత్తగా చేపట్టాలని, చిన్నపొరబాటుకు తావివ్వకుండా చూడాలని కలెక్టర్, ఎన్నికల అధికారి కె.వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం సూళ్లూరుపేట డివిజన్ నందు కలెక్టర్ పర్యటించి పోలింగ్ సామాగ్రి పంపిణీ, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరచనున్న స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటును పరిశీలించి పలు సూచనలు చేశారు. సూళ్ళూరుపేట డివిజన్ కు సంబంధించి 11 లొకేషన్లలో పట్టభద్రులకు 16 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు సంబంధించి 9 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పట్టభద్రుల ఓటర్లు 15,238, ఉపాధ్యాయ ఓటర్లు 893 మంది ఓటు హక్కును వినియోగించుకొనున్నారని అన్నారు. కలెక్టర్‌తో పాటు సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రముని రాణాల్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి

సిపిఎం వినూత్న నిరసన



కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరకు వ్యతిరేకంగా గురువారం సుందరయ్య నగర్ సర్కిల్లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. వంటింట్లో ఉండాల్సిన సిలిండర్, దేవుని గదిలో పూజలు చేసుకోవడానికి ఉపయోగపడుతుందంటూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి రాకమునుపు 460 రూపాయలు వున్న సిలిండర్ ధర నేడు1160 రూపాయలుకు పెంచారని దుయ్యబట్టారు. నష్టాలలో కష్టాలలో వున్న ఆదానిని ఆదుకోవడానికే వంట గ్యాస్ ధరలు పెంచారని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు అల్లాడి పోతున్నారని అన్నారు. పెంచుతున్న ధరలపై అధికార వై. ఎస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ నోరు మెదపక పోవడం అన్యాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే.వేణు, పి.బుజ్జి, పి.చిన్న, నగర కమిటీ సభ్యులు ఆర్.మల్లికార్జున రావు, ఎం.జయంతి, నాయకులు పార్థసారథి, ఉమాపతి, కేశవులు, రాజేశ్వరి, విమలమ్మ, దనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రూ.500 లకే గ్యాస్ ఇవ్వాలి: కాంగ్రెస్

గ్యాస్ ధరలను పెంచి బిజెపి ప్రభుత్వం పేదలకు గ్యాస్‌ను దూరం చేస్తోందని, పేదలకు రూ.500కే గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. గ్యాస్ ధరలు పెంచడంపై తిరుపతి రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. చింతామోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యాస్ ధరలు తగ్గిస్తామన్నారు. స్విమ్స్ ఆస్పత్రి ప్రైవేట్ ఆస్పత్రిగా మారిపోయిందని, రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. స్విమ్స్‌లో రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందించాలన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపు దేశ రాజకీయాలకు పెద్ద మలుపన్నారు. బిజెపి వ్యతిరేక రాజకీయ పక్షాలన్నీ ఏకం కావాలన్నారు. స్టాలిన్ మాటలను తాము స్వాగతిస్తున్నామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సభ్యుల నియామకంపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ లీగల్‌సెల్ అధ్యక్షులు రవి, పిసిసి కార్యదర్శి యార్లపల్లి గోపిగౌడ్, పూతలపట్టు ప్రభాకర్, తేజోవతి, శాంతియాదవ్ పాల్గొన్నారు.



సిపిఎం ఆధ్వర్యంలో...

ఆయుర్వేద ఫార్మశీలో ఔషధాల ఉత్పత్తి సామర్థ్యం పెంపు :టిటిడి

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

టిటిడి ఆధ్వర్యంలోని నరసింగాపురంలో గల ఆయుర్వేద ఫార్మశీలో ఔషధాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని టిటిడి జెఈవో సదా భార్గవి తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతిగహంలో గురువారం ఆయుర్వేద ఫార్మశీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈవో మాట్లాడుతూ ఫార్మశీని బలోపేతం చేసేందుకు మూడు ఇండస్ట్రియల్ షెడ్లు నిర్మించామని, త్వరలో వీటిని ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.3.50 కోట్లతో ఔషధాల తయారీ యంత్రాల కొనుగోలుకు అనుమతి ఇచ్చామని, 75 శాతం యంత్రాల ఏర్పాటు జరిగిందని తెలిపారు. మొత్తం 314 రకాల ఫార్ములాలకు ఆయుష్ శాఖ నుండి అనుమతి లభించిందని, వీటిలో 60 రకాల మందులు మొదటి దశలో ఉత్పత్తి చేసి రోగులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఇంజినీరింగ్ పనుల్లో ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకు, సంపు, మరుగుదొడ్ల నిర్మాణం, సిసి కెమెరాల ఏర్పాటు, పెయింటింగ్ తదితర పనులను మార్చి 15లోపు పూర్తి చేయాలని జెఈవో ఆదేశించారు. తులసివనాల తరహాలో ఫార్మశీ ఆవరణలో ఔషధ మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. డిఎఫ్ఓ ఆధ్వర్యంలో టిటిడికి చెందిన బ్రాహ్మణపట్టు, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, కల్యాణి డ్యామ్, నరసింగాపురం, ఇతర టిటిడి నర్సరీల్లో ఔషధ మొక్కలు పెంచాలన్నారు. ఈ సమీక్షలో డిఎఫ్‌వో శ్రీనివాస్, ఫార్మశీ ఇన్‌చార్జి డాక్టర్ నారపరెడ్డి, ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్, ఐటి జిఎం సందీప్, ఇఇలు మనోహర్, మురళి, డిఇ సరస్వతి, అలిపిరి ఎవిఎస్వో విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత నిల్.. అవినీతి ఫుల్..!

- రూ.40 కోట్లు 'రోడ్డు' పాలు
- 21 కిలోమీటర్ల పొడవునా దుమ్మే
- హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు

వెంకటగిరి నుంచి గూడూరు రూరల్ మండలం గొల్లపల్లి గ్రామ సమీపం వరకూ 21 కిలోమీటర్ల దూరం ఆర్ అండ్ బి అధికారులు వేసిన రోడ్డంతా గుల్లతేలి, దుమ్ముకొట్టుకుపోయి అవినీతి అడ్డంగా కనిపిస్తోంది.. అయితే క్వాలిటీ కంట్రోల్ అధికారుల కళ్లకు మాత్రం కనిపించకపోవడం గమనార్హం. 21కిలోమీటర్ల దూరం రహదారి నిర్మాణానికి కేటాయించిన 40 కోట్ల నిధులు రోడ్డుపాలై, నాణ్యతకు తిలోదకాలిచ్చి అవినీతి ఫుల్లుగా కనిపిస్తోంది. ఈ రహదారి మధ్యలోనే 38 కల్వర్టులు కొత్తవి, పాతవి ఉన్నాయి. వీటి పనుల్లోనూ నాణ్యత డొల్లగా ఉందన్న విమర్శలు లేకపోలేదు. మరోవైపు నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ఇప్పటికే ఒకరు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి.

ప్రజాశక్తి - బాలాయిపల్లి

రహదారులు ప్రగతికి చిహ్నాలు. అయితే కాంట్రాక్టర్లు కక్కుర్తిపడి, అధికారులు అవినీతిని చూసీచూడనట్లు వదిలేయడంతో బాగున్న రోడ్డు స్థానంలో కొత్తగా వేసిన రోడ్లు కంకరతేలి, దుమ్ము లేస్తోంది. ఒకపక్క నిర్మిస్తుంటే, మరోపక్క రోడ్డు దుస్థితికి అద్దం పడుతోంది. క్వాలిటీ కంట్రోల్ శాఖ తనిఖీలే లేవు. దీంతో పదికాలాల పాటు పదిలంగా ఉండాల్సిన రోడ్డు నాణ్యతలో డొల్లతనం కనిపిస్తోంది. ఏడాదిక్రితం వెంకటగిరి నుంచి బాలాయపల్లి, గూడూరు మండలంలోని తప్పవారుపాడు క్రాస్ రోడ్డు వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం పనులు మంజూరయ్యాయి. రూ.40 కోట్ల అంచనాలతో పనులను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఈ పనులను రెండు భాగాలుగా విభజించి కాంట్రాక్టర్లకు అప్పగించారు. రోడ్డు పనుల్లో అంబలపూడి గ్రామం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మించారు. సిమెంట్ సమపాళ్లలో వాడకుండా ఇసుక ఎక్కువ వాడడంతో సిసి రోడ్డు బేస్‌మెంట్ నాణ్యత లేక నాశిరకంగా కనిపిస్తోంది. మన్నూరుమిట్ట గ్రామం క్రాస్‌రోడ్డు, గ్రామాల వద్ద రోడ్డు పనుల్లో గుల్ల లేచిన దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ తోలి బర్మలను పూర్తి చేయాల్సి ఉండగా రోడ్డు పక్కన ఉన్న బురదమట్టిని జేసీబీలతో తీసి రోడ్డుకు ఇరువైపులా నింపారు. వర్షం వస్తే రోడ్డు ఇరువైపులా ఉన్న మట్టి కరిగిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపనుల్లో వాడే కంకరలో నాణ్యత లేకుండా పిండిగా ఉండే కంకర వాడుతున్నట్లు తెలుస్తోంది. కంకర వేసి రోలింగ్‌చేసే క్రమంలో వాటర్ క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదు. కొన్నిచోట్ల బాగున్న తారుపైనే మరో లేయర్ వేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల బాగున్న తారు రోడ్లను పెకళించి దాన్నే రోలింగ్‌చేసి, ఆపైనే తారు వేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు కిలోమీటర్ల



మేర బాగున్న రోడ్డును తవ్వి ఆ తారును తొలగించాల్సి ఉండగా ఆ తారుపైనే రోలింగ్ చేసి తారు రోడ్డు వేశారు. కనీసం వాటర్ క్యూరింగ్ సైతం సరిగ్గా జరగడం లేదన్న విమర్శలున్నాయి. నిర్మాణం జరుగుతున్న సందర్భంలో వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులను కాంట్రాక్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మన్నూరుమిట్ట గ్రామ సమీపంలో వెంకటగిరి పట్టణం మున్సిపల్ కౌన్సిలర్ కారు బోల్తా పడిన సంగతి తెలిసిందే. నేరేడు కాల్వ సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. అంబలపూడి గ్రామ సమీపం వద్ద మోటారు సైకిల్ కారు ఢీకొనడంతో క్షతగాత్రులయ్యారు. వెంగమాంబపురం వద్ద ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డు లేకపోవడంతో ఓ ఉపాధ్యాయుడు ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. నిత్యం ఈ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా సూచిక బోర్డులను పెట్టకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్లు
సిఎండి కె. సంతోష రావు వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఎస్ పిడిసిఎల్) పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, సత్వర సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కాల్ సెంటర్లో అధునాతన సాంకేతికతతో ఏర్పాటు చేసిన ఐవిఆర్ఎస్ సేవలు గురువారం నుంచి వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా సిఎండి కె. సంతోషరావు మాట్లాడుతూ విద్యుత్తు వినియోగదారుల సమస్యల సత్వరం పరిష్కారం కోసం కాల్ సెంటర్లో ఐవిఆర్ఎస్, రోబో టెక్నాలజీని వినియోగిస్తున్నామన్నారు. టెక్నాలజీని అతి తక్కువ సమయంలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) కె. శివప్రసాద రెడ్డి ఆధ్వర్యంలోని అధికారులు, సిబ్బంది బందాన్ని సిఎండి ప్రత్యేకంగా అభినందించారు. సంస్థ పరిధిలోని వినియోగదారులకు తమ విద్యుత్ సమస్యల పరిష్కారానికై 1912 లేదా 1800 425 15533 టోల్-ఫ్రీ నంబర్లను సంప్రదించి, సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్, హెచ్ఆర్ డి) ఎన్వీఎస్ సుబ్బరాజు, చీఫ్ జనరల్ మేనేజర్లు పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్య, జనరల్ మేనేర్లు పద్మ, శారద, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 'ఫేస్ రికగ్నిషన్'అమలు పరిశీలన



ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి దర్శనార్థం విచ్చేసే సామాన్య భక్తులకు టిటిడి అందిస్తున్న సౌకర్యాలు మరింత పారదర్శకంగా, వేగంగా అందించేందుకు వీలుగా మార్చి 1వ తేదీ నుంచి తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని గదులు కేటాయించే కేంద్రాలు, ఉప విచారణ కార్యాలయాలను ఈవో గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో దళారీ వ్యవస్థను పూర్తిగా తగ్గించేందుకు, టిటిడి అందిస్తున్న సౌకర్యాలు సామాన్య భక్తులకు పూర్తిస్థాయిలో చేరేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. తిరుమలలో సర్వదర్శనం, లడ్డూప్రసాదం, గదుల కేటాయింపు, రీఫండ్ చెల్లింపు అంశాల్లో ఈ పరిజ్ఞానం ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్లు తెలిపారు. తద్వారా గదులను రొటేషన్ చేసే పద్ధతిని పూర్తి స్థాయిలో అరికట్టవచ్చన్నారు. గదుల కొరకు పేర్లు నమోదు చేసుకున్న భక్తులకు త్వరితగతిన రూములు దొరుకుతున్నాయని తెలిపారు. రెండవ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి టోకెన్లు లేకుండా సర్వదర్శనానికి వెళ్ళే భక్తులకు కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానంతో రూ.50 ఉచిత లడ్డు టోకెన్లు ఇవ్వడం జరుగుతోందని, ఈ పరిజ్ఞానం ద్వారా లడ్డు ప్రసాదాలలో దళారి వ్యవస్థను కట్టడి చేయవచ్చని వివరించారు. అంతకుముందు ఈవో ఏఆర్పి, సిఆర్ఓ, ఎంబీసీ 34 గదుల కేటాయింపు కేంద్రాలు, ఏఎంసి, ఎస్ఎంసి, టిబిసి ఉప విచారణ కార్యాలయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈవో వెంట డిప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, భాస్కర్, ఏఈఓ వెంకటేశ్వర్లు నాయుడు, ఓఎస్డి రామకష్ణ, ఇతర అధికారులు ఉన్నారు.

నవజీవన్ ఆశ్రమానికి లయన్స్ క్లబ్ చేయూత

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

లయన్స్ క్లబ్ అఫ్ సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో తిరుపతి తిరుచానూరు రోడ్డు నందలి నవజీవన్ బ్లైండ్ పూర్ హోమ్ లో ఉండే అనాధ అంధత్వ పిల్లలకు భోజనం, పండ్లు, బిస్కెట్లు, చేకోలెట్ లు పంచిపెట్టారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ప్రతిఒక్కరూ సమాజం పట్ల నడుచుకోవాలని సూచించారు. అంతేకాక నవజీవన్‌లో అనాధ అంధత్వ పిల్లలకు లయన్స్ క్లబ్ అఫ్ సెవెన్ హిల్స్ ద్వారా చేయూత ఇవ్వడం చాల ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ కార్యదర్శి వి. జగన్నాధం, బెల్లంకొండ సురేష్, బాసికర్ల రఘు, కస్పా పద్మనాభం, పవన్ ,రోహిత్ బాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిటీ ఫౌండేషన్ వితరణ

పదో తరగతి విద్యార్థులకు 'విజయ సాధన' పుస్తకాలు



ప్రజాశక్తి - సత్యవేడు రూరల్

శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా మండలంలోని మాదనపాలెం, ఇరుగుళం జడ్పీ హైస్కూళ్ల పదవ తరగతి విద్యార్థులకు "విజయ సాధన" పుస్తకాలను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా విద్యా శాఖకు చెందిన డిస్ట్రిక్ట్ కామన్ ఎక్సమినేషన్ బోర్డు ద్వారా పదవ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల ప్రిపరేషన్ కు ఉపయోగపడే ప్రత్యేక స్టడీ మెటీరియల్ ను "విజయ సాధన" పేరిట తయారుచేసి విక్రయిస్తున్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా వాటిని కొనుగోలు చేసి విద్యార్థులకు అందచేశారు. మాదనపాలెంలో 21 మందికి, ఇరుగుళంలో 57 మందికి దీనిని పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్రకుమార్ తెలిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

52వ జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీసిటీ ఫౌండేషన్, సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో గురువారం శ్రీసిటీ పరిధిలోని మాదనపాలెం, ఇరుగుళం జడ్పి హైస్కూళ్లు, చిన్మయా విద్యాలయ, అకార్డ్ స్కూల్ కు చెందిన 6 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఇళ్ళు, రోడ్లు, పని ప్రదేశాల్లో ప్రమాదాలు అన్న అంశాలపై డ్రాయింగ్ వేశారు. ఈ నెల 4వ తేదీన శ్రీసిటీలో జరుపనున్న జాతీయ భద్రతా ముగింపు ఉత్సవాలలో డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు సురేంద్రకుమార్ తెలిపారు.



త్వరలోనే తిరుమలకు 'ఒలెక్ట్రా ఈ-బస్సులు'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)తిరుమలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానానికి ఉచితంగా అందించే ఎలక్ట్రిక్ బస్సుల నమూనా సిద్ధమయ్యింది. ఎం ఈ ఐ ఎల్ గ్రూప్ అనుబంధ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ ఈ బస్సులను హైదరాబాద్ సమీపంలోని తన ప్లాంట్ లో తయారు చేస్తోంది. తి తి దే మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన తొలి బస్సును గురువారం దేవస్థానముల రవాణా విభాగం జనరల్ మేనేజర్ పి వీ శేషారెడ్డి సమగ్రంగా పరిశీలించారు. ఒలెక్ట్రా తయారు చేసిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 10 ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే)కు అందించాలని ఎం ఈ ఐ ఎల్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ బస్సులను తిరుమలను సందర్శించే భక్తులకు కాలుష్య రహిత ప్రయాణం అందించేందుకు టీటీడి వినియోగించనుంది. టి టి డి అధికారులకు బస్సు పనితీరును ఒలెక్ట్రా ప్రతినిధులు వివరించారు. ప్రయాణికులకు పూర్తి భద్రత కల్పించేలా బస్సును తయారు చేశామని తెలిపారు. బస్సుల్లో ఎలెక్ట్రానిక్ డిస్ప్లే బోర్డ్ ద్వారా ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయా ణిస్తోందో తెలిపే



వివరాలు పొందు పరిచారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుమలలో తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది, తిరుమల పవిత్రత, ప్రాశస్త్యాన్ని తెలిపే ఫోటోలను బస్సు పై పొందు పరిచారు. బస్సులో కొద్దిదూరం ప్రయాణించిన శేషారెడ్డి దాని పనితీరు పట్ల సంతప్తి వ్యక్తం చేయడం తో పాటు దేవస్థానం పాలకవర్గం, ఉన్నతాధికారులకు దాని పని తీరును వివరిస్తానని తెలిపారు. ఎం ఈ ఐ ఎల్ విద్యుత్ బస్సులను అందించటం సంతోషంగా ఉందని, వీటి వల్ల తిరుమల కొండపై కాలుష్య నియంత్రణ జరుగుతుందని అన్నారు.

శబ్ధ, వాయు కాలుష్యంలేని ప్రయాణం

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కేవీ.ప్రదీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ "ఎం ఈ ఐ ఎల్ భగవంతుని సేవలో ఎప్పుడూ ముందుంటుంది. సంస్థ ప్రయాణంలో వేంకటేశ్వర స్వామి ఇచ్చిన ఆశీర్వాదాలకు ఈ విధంగా కతజ్ఞతలు తెలుపుకోగలుగుతున్నాము. సంస్థ పురోగతి, భవిష్యత్తు ప్రయత్నాలలో ఆ స్వామివారి ఆశీస్సులు తమపై ఉండాలని కోరుకుంటున్నాము. 9 మీటర్ల పొడువున్న 10 ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానానికి త్వరలో అందించనున్నాము. ఈ-బస్సుల కోసం ఛార్జింగ్? పాయింట్లు కూడా ఏర్పాటు చేస్తున్నాము" అని తెలిపారు. వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు పరిశుభ్రమైన, వాయు, శబ్ధ కాలుష్యంలేని ప్రయాణాన్నిఈ విద్యుత్ బస్సుల ద్వారా అందిస్తామని ప్రదీప్ తెలిపారు. ప్రస్తుతం తిరుమలలో 12 డీజిల్ బస్సులు భక్తులకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల సేవలు ప్రారంభం అయితే తి తి దే కు డీజిల్ ఖర్చుల భారం తగ్గటంతో పాటు పర్యావరణం మెరుగు పడేందుకు ఎంతో అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఏపీఎస్ ఆర్ టి సి) ఆధ్వర్యంలో 50 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు ప్రతిరోజూ తిరుపతి , తిరుమల మధ్య నడుస్తూ భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే.

గొంతెత్తి నిలదీస్తే వేధిస్తున్నారు

నారా లోకేష్‌ను కలిసిన యుటిఎఫ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సిపిఎస్ రద్దు విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాటతప్పి మడమతిప్పారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. చంద్రగిరి నియోజకవర్గం గుమ్మడివారి ఇండ్లు క్యాంపు సైట్‌లో నారా లోకేష్‌ను యుటిఎఫ్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. యువగళం పాదయాత్ర 32వ రోజు గురువారం 13 కిలోమీటర్ల దూరం నడిచారు. గుమ్మడివారిఇండ్లు విడిదికేంద్రం వద్ద పాదయాత్ర ప్రారంభమయ్యింది. పోలవరపు ఇండ్లు, దామలచెరువు మ్యాంగోనగర్, ముస్లీం సామాజికవర్గీయులతో ముఖాముఖి నిర్వహించారు. కొండేపల్లి వద్ద భోజన విరామం. అక్కడే రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం యాత్ర పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డిపల్లి విడిదికేంద్రంలో ప్రవేశించింది. రాత్రికి అక్కడే బస చేయనున్నారు.

గుమ్మడివారిఇండ్లు వద్ద ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రాథమిక విద్య రెండేళ్లకు, మాధ్యమిక విద్య మూడేళ్లకు కుదించారని, దీనివల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీచర్ల భర్తీకి ఇప్పటివరకూ డిఎస్‌సి నిర్వహించలేదన్నారు. ఒక కిలోమీటర్



లోపు పాఠశాలలను విలీనం చేశారన్నారు. 10 మంది విద్యార్థులకన్నా తక్కువ ఉన్న 1500 పాఠశాలలను నేడో రేపో మూసివేయాలని ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల మారుమూల ప్రాంతాల్లోని పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. నారా లోకేష్ స్పందిస్తూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో సైకో ప్రభుత్వం ఉపాధ్యాయులను వేధించడమే పనిగా పెట్టుకుందన్నారు. డిమాండ్ల సాధన కోసం పోరాడిన ఉపాధ్యాయులపై, ఉద్యోగులపై కేసులు బనాయించడం నియంతృత్వం పోకడలకు నిదర్శనమన్నారు. గొంతెత్తి నిలదీసేవారిని రకరకాలుగా వేధిస్తున్నారన్నారు. గురువులను దొంగలుగా చిత్రీకరిస్తూ తప్పుడు కేసులు బనాయించడం జగన్మోహన్‌రెడ్డి నీచత్వానికి నిదర్శనమన్నారు. న్యాయమైన హక్కుల కోసం ఉపాధ్యాయులు చేసే పోరాటానికి టిడిపి అండగా ఉంటుందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం బనాయించిన తప్పుడుకేసులను, సస్పెన్షన్లను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. దామలచెరువులో ముస్లీం సామాజికవర్గం ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు. రంజాన్ తోఫా రద్దు చేశారని, మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదన్నారు మైనార్టీ వ్యాపారులకు ఎటువంటి రుణాలు ఇవ్వడం లేదన్నారు. దామలచెరువు ప్రాంతంలో ఉన్న 200 ముస్లీం కుటుంబాలకు పట్టాలు లేవన్నారు. లోకేష్ మాట్లాడుతూ 1985లో మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, రంజాన్ తోఫా, విదేశీ విద్య, పెళ్లికానుక పథకాలను అమలు చేసింది చంద్రబాబని గుర్తు చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగు పదవులు ఉన్న చెవిరెడ్డి చీర, స్వీట్‌బాక్సు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రైతులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి రైతులేని రాజ్యాన్ని తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వ్యవసాయ పెట్టుబడిని తగ్గిస్తామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని, వ్యవసాయాన్ని ఉపాధిహామీకి అనుసంధానం చేయాలనే డిమాండ్‌ను కేంద్రంతో పోరాడి చేయాల్సి ఉందన్నారు. మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు




తిరుపతి అర్బన్ : ఎపి జేఏసీ, ఎపి ఎన్జీవో అసోసియేషన్ తిరుపతి నగర శాఖ అధ్యక్షులు ఎస్.సురేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఎస్వీఆర్ఆర్‌జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, శ్రీ పద్మావతి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రోజ, రుయా సూపరింటెండెంట్ అరుణ, ఎపి జెఎసి సెక్రటరీ డి.నిర్మల, ఎపి నర్సింగ్ అసోసియేషన్ నాయకులు భువనేశ్వరి, వరలక్ష్మి, ఎపి ఎన్జీవో అసోసియేషన్ నగర కార్యదర్శి జి.బాలాజి పోటీలను ప్రారంభించారు. మార్చి 8న ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.గిరిబాబు, టి.సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రఘు, సుబ్రమణ్యం, సరోజ, తులసమ్మ పాల్గొన్నారు

విద్యాదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



ప్రజాశక్తి - తిరుపతి అర్బన్: శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు 10 లక్షల ఒక వెయ్యి 16 రూపాయలను గురువారం విరాళంగా అందించారు. తిరుపతికి చెందిన కె.శ్రీనివాస్, జగదీష్ చంద్ర ఈ మేరకు విరాళాన్ని తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో జేఈవో సదా భార్గవికి అందజేశారు. దేవస్థానం విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వినతి



ప్రజాశక్తి-నాయుడుపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శేఖర్‌కు మధ్యాహ్న భోజన కార్మిక నాయకులు, కార్మికులు వినతిపత్రం అందించారు. ఎంఈవో కార్యాలయానికి తనిఖీకి వచ్చిన ఆయనకు నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సంఘ నాయకులు ఆయన్ను కలిసి సమస్యలను విన్నవించారు. మధ్యాహ్న భోజన కార్మిక జిల్లా కార్యదర్శి విజయమ్మ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ నాయకుల వేధింపులు అరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వంట పాత్రలు, గ్యాస్ ప్రభుత్వం సరఫరా చేయాలని రాగి జావాకు ప్రభుత్వం బిల్లు అదనంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వాణి, మీనమ్మ, పెంచలయ్య, సుమతి, జయమ్మ, విమలమ్మ, సుబ్బమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన



ప్రజాశక్తి-కేవీబీపురం: పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ గురువారం సీపీఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆధ్వర్యంలో పెరిందేశం సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ పేద ప్రజలు వాడుకునే నిత్యావసర ధరలు పెంచడమే కాకుండా వంట గ్యాస్ ధరలు భారీగా పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యురాలు వరలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులుగా శేఖర్



ప్రజాశక్తి-నాయుడుపేట: శ్రీకాళహస్తిలో జరిగిన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో నాయుడుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న చేజర్ల శేఖర్‌ను రెండోసారి యూటీఎఫ్ తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. 1989 లో ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి యూటీఎఫ్‌లో ప్రాథమిక సభ్యులుగా చేరి ఉద్యమస్ఫూర్తితో నాయుడుపేట అసోసియేట్ అధ్యక్షుడిగా, ఓజిలి, నాయుడిపేట, ముత్తుకూరులలో యూటీఎఫ్ అధ్యక్షుడిగా, జిల్లా ఆడిట్ సభ్యులుగా, జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా, గత సంవత్సరం తిరుపతి జిల్లా ఏర్పడ్డాక మొట్టమొదటి గౌరవాధ్యక్షులుగా ఉత్తమ సేవలందించారు. ఆయన సేవలను గుర్తించి సమావేశంలో మళ్లీ ఆయన్ను ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండోసారి తనని గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మార్చి 13వ తేదీ జరిగే శాసన మండలి ఎన్నికలల్లో పీడీఎఫ్ అభ్యర్థులైన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిలను గెలిపించుకునేందుకు తమ ప్రథమ బాధ్యత అన్నారు. ప్రతిఒక్కరూ వారి విజయానికి కృషి చేయాలని కోరారు.

11న జాతీయ సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీలో ఈనెల 11వ తేదీన ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్ రెడ్డి, విభాగాధిపతి డా.యస్.సురేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రాంగణంలో సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరిశోధనలను ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమ కన్వీనర్ డా.ఐ.ప్రభాకర్‌రెడ్డి విద్యార్థి కోఆర్డినేటర్లు గురుసాయి, యశ్వంత్, వెంకటసాయి, సాయికుమార్ పాల్గొన్నారు.


పదోతరగతి ఫలితాలే విద్యార్థికి తొలిమెట్టు



ప్రజాశక్తి-పిచ్చాటూరు: పదోతరగతి ఫలితాలే విద్యార్థికి తొలిమెట్టు అని.. విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని .. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిచ్చాటూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధర్‌రాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక మెళకువలను అందిస్తూ పాఠశాల ఉపాధ్యాయులు సైతం కృషి చేస్తున్నారని తెలిపారు.

సంస్కృత బోధన మెరుగుపరచాలి

- నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ ఛైర్మన్ డాక్టర్ అనిల్ సహస్ర బుద్ధే
- వేడుకగా సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవం



ప్రజాశక్తి - క్యాంపస్ : సంస్కృత బోధన నాణ్యతను మెరుగు పరచాల్సిన ఆవశ్యకత ఉందని నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ ఛైర్మన్ డాక్టర్ అనిల్ సహస్ర బుద్ధే పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవం స్థానిక మహతి ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ఛాన్సలర్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఎన్నికల సంఘం మాజీ ఛైర్మన్, నీడామంగళం గోపాలస్వామి అధ్యక్షత వహించారు. నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరమ్ ఛైర్మన్, ప్రాచ్య పాశ్చాత్య అధ్యయనాలలో నిపుణులు, స్నాతకోత్సవ ముఖ్య అతిథిగా డా.అనిల్ సహస్రబుద్ధే విచ్చేసి స్నాతకోత్సవ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతం బోధన, పరిశోధన, కమ్యూనిరేషన్, వినోదం, జర్నలిజం, వెబ్సైట్లు మొదలైనవాటికి మాధ్యమంగా ఉపయోగించబడాలంటే సామాన్య ప్రజలకు ఆమోదయోగ్యమైన సింపుల్ స్టాండర్డ్ సంస్కృతాన్ని మెరుగుపరచాలని కొనియాడారు. లేని పక్షంలో సంస్కృతం పండితుల భాషగా మాత్రమే మిగిలిపోయి గ్రంథాలలో మాత్రమే మిగిలిపోతుందని తెలిపారు. సంస్కృత బోధన నాణ్యతను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, సంస్కృతం బోధించే విధానం మరింత ఆకర్షణీయంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించి ప్రజలకు మరింత చేరువగా సంస్కృతాన్ని తీసుకెళ్లాలని వివరించారు. పాఠ్యపుస్తకాలను సవరించడం, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, ఆధునిక బోధనా సామగ్రిని అభివృద్ధి చేయడం, సంస్కృతంలో విద్యార్థుల పూర్తి నైపుణ్యాలను పెంపొందించడం వంటి ఈ పనులను సాధించడానికి ప్రతి ఒక్కరూ సంస్కృతం గురించి ఆలోచించాలన్నారు. కులపతులు ఎన్. గోపాలస్వామి మాట్లాడుతూ "విశ్వవిద్యాలయం ఎన్ఈపీ 2020 ను అమలు చేయడం ప్రారంభించిందన్నారు. ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్‌ను తీసుకురావడం, సబ్జెక్టుల ఎంపికను విస్తరించడం వంటి అనేక మార్పులు చేయబడ్డాయన్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా సబ్జెక్ట్ జాబితాను రూపొందించడం అవసరమని, అధ్యాపకులు తగిన మార్పులు చేస్తూ మెరుగులద్దుతూ ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా బోధించే కోర్సుల ఔచిత్యాన్ని కొనసాగించగలుగుతామన్నారు. డిగ్రీ ఉపాధి పొందిన విద్యార్థులను, గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. స్నాతకోత్సవం సందర్భంగా 118 విద్యార్థులకు పీహెచ్డీ, 63 విద్యార్థులకు ఎంఫిల్ పట్టాలను అందించారు. శాస్త్రి (డిగ్రీ), ఆచార్య (ఎమ్.ఎ), శిక్షాశాస్త్రి (బి.ఇడి), శిక్షాచార్య (ఎమ్.ఇడి), డిప్లొమో పి.జి. డిప్లొమో కోర్సులతో కలిపి మొత్తం 1602 విద్యార్థులు వివిధ డిగ్రీలను అందుకొన్నారు. వివిధ కోర్సులలో ప్రథమస్థానాన్ని పొందిన 44 మంది గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగం ద్వారా, శ్రీరామానుజ ప్రాజెక్ట్ ద్వారా ప్రచురించిన 16 పుస్తకాలను ఆవిష్కరించారు. ఉపకులపతి ఆచార్య కృష్ణమూర్తి మాట్లాడుతూ గత 60 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయం రోజురోజుకు విస్తరిస్తోందని కొనియాడారు. సంస్కృత భాషాధ్యయనం, మాన్యుస్క్రిప్ట్ ఎడిటింగ్, ప్రచురణ,సాంస్కృతిక సాహిత్యం కళల సృష్టి తాత్విక ఆలోచనల పునరుజ్జీవనం, దాని కోసం వ్యవస్థల నిర్మాణం మొదలైన వాటి ద్వారా భారతీయ సాంప్రదాయ విజ్ఞాన శాస్త్రాన్ని అభివృద్ధి చేయడం వ్యాప్తి చేయడం ప్రాథమిక లక్ష్యాలు అని వివరించారు. విశ్వవిద్యాలయం ఇ-పాఠశాలను, ఆన్లైన్ తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్స్ వైస్ ఛాన్సలర్ ప్రొ. వెంగమ్మ, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, అకడమిక్ కౌన్సిల్, ఫైనాన్స్ కమిటీ విశిష్ట సభ్యులు, విశ్వవిద్యాలయం డీన్ నియంత్రణాధికారి డా.కె.సాంబశివమూర్తి , ప్రముఖులు, వివిధ సంకాయ డీన్లు, విభాగాధ్యక్షులు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్వాంసులు, రిజిస్ట్రార్ , ఫైనాన్స్ ఆఫీసర్, శాస్త్ర పరిరక్షణ కేంద్రం డైరెక్టర్లు, దూరవిద్య సంస్కృత అభివృద్ధి కేంద్రం డైరెక్టర్లు, గ్రంథాలయ సభ్యులు, విశ్వవిద్యాలయ భోధనేతర ఉద్యోగులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగాదిలోపు గృహప్రవేశాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

జగనన్న గహ నిర్మాణాలు, రీ సర్వే , ఎన్ హెచ్ ఏ ఐ భూసేకరణ, వ్యవసాయ ఉద్యానవన పశుసంవర్ధక శాఖ పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి తదితర శాఖలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వర్చువల్ విధానంలో అమరావతి నుండి సమీక్షించారు. తిరుపతి నుండి జిల్లా కలెక్టర్ కే వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులతో కలెక్టర్ ఛాంబర్ నుండి హాజరయ్యారు. కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ పేదలందరికీ ఇళ్ల గహ నిర్మాణాలు వేగవంతం కావాలని, ఇప్పటికే పూర్తి అయిన 11,582 ఇళ్లతో పాటు పైకప్పు బడిన, స్లాబ్ మట్టంలో ఉన్న ఇల్లు పూర్తి అయ్యేలా ఉగాది నాటికి సామూహిక గహప్రవేశాలు లక్ష్యాల మేరకు చేపట్టేలా ఉండాలని ఉన్నారు. మార్చి 10 లోపు ఇంకా ప్రారంభం కాని గహాలను 100శాతం ప్రారంభించాలని తెలిపారు. రోజువారి స్టేజి కన్వర్షన్లు లక్ష్యాల మేరకు సాధించాలి అన్నారు. రీ సర్వే డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్, స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం చేయాలని, రీ సర్వే రెండవ దశ గ్రామాలు ఏప్రిల్ చివరి నాటికి పూర్తి కావాలని ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీల హాజరు, వాటి బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, ఆధార్ సీడింగ్ వేగవంతం చేయాలని, అమత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లాలో పురోగతిలో ఉన్న 29 చెరువుల పునరుద్ధరణ పనులను ఈనెల ఆఖరిలోపు పూర్తి అయ్యేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని డ్వామా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏ డి సర్వే జయరాజ్, డ్వామా పిడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీర్ శంకర్ నారాయణ, గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వర్ రావు జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాలు లోపిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-చిల్లకూరు: ఈనెల 14, 15, 16వ తేదీలలో జరుగనున్న ముత్యాలమ్మ జాతరలో భక్తులకు మౌలిక సదుపాయాలు లోపిస్తే సంబంధిత శాఖ అధికారులకు కఠిన చర్యలు తప్పవని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర కోఆర్డినేషన్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతర సంబంధించిన వివిధ శాఖ అధికారులతో చర్చించి వారికి ఆదేశాలు ఇచ్చారు. జాతరకు సుమారు 5 లక్షల మంది భక్తులు రావొచ్చని అంచనా వేసి వారికి ప్రయాణ సౌకర్యాలు, ఆరోగ్యపరంగా మెడికల్ సెంటర్లు, టాయిలెట్స్, నీటి సదుపాయాలు, వాహనాలు పెట్టుకోవడానికి, రోడ్లు విస్తారంగా ఉండడానికి ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించారు. ముత్యాలమ్మ గుడి నుండి పోలేరమ్మ గుడి వరకు భక్తులకు కనీసం 25 అడుగులు దారి ఉండాలని సూచించారు . కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, గూడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు, ఎస్సై గోపాల్, చిల్లకూరు తహశీల్దారు, ట్రాన్స్కో అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



పన్నులు సకాలంలో చెల్లించాలి : కమిషనర్

తిరుపతి టౌన్ : తిరుపతి నగరాభివృద్ధికి సహకరించి బకాయిలున్న వారు వెంటనే తమ పన్నులు చెల్లించాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి ప్రజలనుద్దేశించి కోరారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశమైన కమిషనర్ అనుపమ మాట్లాడుతూ పన్నులు పూర్తిగా వసూలు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో అవసరమైన ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెబుతూ నీటి సరఫరా గురించి మాట్లాడుతూ శుద్ధి చేసిన నీటిని ప్రజలకి నిరంతరం అందిస్తున్నామని, అదేవిధంగా మురికినీటి పారుదలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని ప్రజలు గ్రహించే విధంగా అధికారులు పని చేయాలన్నారు. ఈ సంవత్సరం మార్చి బడ్జెట్ విషయాన్ని ప్రస్థావిస్తూ పన్ను బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేయాలన్నారు. మొండి పన్ను బాకాయిల గురించి మాట్లాడుతూ అవసరమైన లీగల్ చర్యలను చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతు మాధవ్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



అమ్మవారి సేవలో స్పీకర్ తమ్మినేని సీతారామ్

ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీ పద్మావతి అమ్మవారిని గురువారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఏవీఎస్‌వో శైలేంద్రబాబు, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ మధుసూదన్, సీఐ రామ్మోహన్, ఆన్‌స్పెక్టర్లు ప్రసాద్, అశోక్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



ప్రజాస్వామ్య హక్కుల కోసం నిరంతర పోరాటం



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు రెండో పట్టణ పరిధిలో గురువారం సీఐటీయూ నాయకత్వంతో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆర్ట్స్ కాలేజ్, నర్సింగారావుపేటలో ఇరిగేషన్ కార్యాలయం, జలవనరుల శాఖ, కార్మికశాఖ, మత్స్యశాఖ కార్యాలయ సిబ్బందిని కలిసి అభ్యర్థించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి లకు అమూల్యమైన ఓటు వేసి అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జోగి శివకుమార్, బి.వి.రమణయ్య, యస్.సురేష్, బి.చంద్రయ్య, జి.మదన్ పాల్గొన్నారు.




పుత్తూరు టౌన్: ఈనెల 13న జరగబోయే ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పొక్కిరెడ్డి బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలని ఉభయగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షాక్ సాబ్జి అభ్యర్థించారు. పుత్తూరులోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేష్, సీపీఐ పట్టణ అధ్యక్షులు మహేష్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు మునెయ్య, ఎల్ఐసీ యూనియన్ నాయకులు కోరారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యకు చర్యలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఇందిరమ్మ సూచించారు. గురువారం ఉదయం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ మునివేలమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించాలని.. పారిశుద్ధ్యం, తాగునీటిపై రోజూ పర్యవేక్షణ ఉండాలని సర్పంచులకు సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోఉన్న కారణంగా ప్రభుత్వ పథకాలపై సమీక్షలు నిర్వహించకుండా ఎలాంటి తీర్మానాలు ప్రతిపాదించకుండా సమావేశాన్ని ముగించారు. నిర్వహించ బోయే సమావేశానికి తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరాజు, వ్యవసాయ శాఖ అధికారులు, సర్పంచులు. ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబరు, వైస్ ఎంపీపీలు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధికి కృషి



ప్రజాశక్తి-బాలాయపల్లి: అలిమెలి గ్రామ సమీపంలోని కనుమరాయుడు కొండపై వెలిసిన శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో గురువారం తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకటగిరి నియోజకవర్గం కన్వీనర్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాభివద్ధికి తమ వంతు కషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, వైసీపీ నాయకులు ఢిల్లీబాబు, మేడిచర్ల బాబురెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీహరిరెడ్డి, తోట గణేష్, మాజీ ఎంపీపీ సింగంశెట్టి భాస్కరరావు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సముద్రాల శంకర్‌నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విందూరు ఉన్నత పాఠశాల తనిఖీ



ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు ఉపవిద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి విందూరు హైస్కూల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై తగు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులకు పూర్వవిద్యార్థులు అందించిన పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయరామనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన జూలియన్ రాజు



ప్రజాశక్తి-రేణిగుంట: నూతన ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన రష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యాన్ని గురువారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఆషా స్వచ్ఛంద సేవ సంస్థతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంస్థ ఆధ్వర్యంలో జూలియన్ రాజు చేస్తున్న కషిని అభినందించారు. ఇకపై సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

పద్మావతి మహిళా వర్సిటీలో వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లైడ్ మైక్రోబయాలజీ అండ్ బయో కెమిస్ట్రీ, సూక్ష్మ వీక్షణ మైక్రోబయాలజిస్ట్ సొసైటీతో కలిసి ఇనిడాన్ సైన్స్ డే ఎగ్జిబిషన్ నిర్వహించింది. సైన్స్ డేలో భాగంగా ఎంఎస్సీ మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ విద్యార్థులు ఎగ్జిబిషన్ లో వివిధ పరికరాలను, చార్డులను , నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు ముఖ్యమైన పర్యావరణ సూక్ష్మజీవుల నమూనా, ప్రయోజనకరమైన సూక్ష్మ జీవుల నమూనా, పుట్టగొడుగుల పెంపకం, పులియబెట్టిన ఆహారాలు, రక్త వర్గీకరణ, హెచ్‌బీ పరీక్ష , టైఫాయిడ్ పరీక్ష నమూనాలను ప్రదర్శించారు. పాఠశాలలోని 500 మంది విద్యార్థులు పాల్గొని ఉత్సాహంతో నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు, డిగ్రీ విద్యార్థులు హాజరయ్యారు. విభాగాధిపతి, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ చాంది కుమారి, ప్రొఫెసర్ సువర్ణలతా దేవి, ప్రొఫెసర్ ఉమా మహేశ్వరి దేవి, ప్రొఫెసర్ జయ మాధురి, డాక్టర్ వాణి డాక్టర్ జ్ఞానేశ్వరి, డాక్టర్ రుక్మిణి, శ్రీమతి పి. లేఖా రమణి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంటర్ డిసిప్లినరీ లైఫ్ సైన్స్ ప్రోగ్రాం ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్" కింద , తిరుపతి వారు ప్రాజెక్ట్ అసోసియేట్ గాను ఒక సంవత్సరం ప్రారంభ కాలానికి పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పనితీరు అంచనా/మూల్యాంకనం ఆధారంగా తరువాతి సంవత్సరానికి పునరుద్ధరించబడతారు). ప్రాజెక్ట్ వ్యవధి 5 సంవత్సరాలు ఉండగా.. వేతనం నెలకు రూ.25 వేలు ఉంటుందన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ వెబ్‌సైట్ మరియు వార్తాపత్రికలో ప్రచురించబడిన తేదీ నుండి 15 రోజులలోపు ఉంటుందని తెలిపారు. వెబ్‌సైట్ లో పేర్కొన్న షరతులను సమ్మతించిన ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను సాదా కాగితంపై వారి వ్యక్తిగత (ఇ-మెయిల్, మొబైల్ నెం.) మరియు విద్యాసంబంధ సమాచారాన్ని పేర్కొంటూ పోస్టల్ సర్వీస్ ద్వారా ప్రొ. ఎ.శ్రీదేవి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, డిబిటి-బిల్డర్ ప్రాజెక్ట్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, పద్మావతి నగర్, జిల్లా: తిరుపతి-517502 చిరునామాకు పంపాలని తెలిపారు. సందేహాల కోసం 9393867573 నంబరున సంప్రదించాలని కోరారు.

వాహన పన్నులు చెల్లించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సకాలంలో వాహన పన్నులు చెల్లించకుంటే భారీ జరిమానా తప్పదని శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ అధికారి బి. దామోదరనాయుడు గురువారం హెచ్చరించారు. శ్రీకాళహస్తి పరిధిలో గత సంవత్సరం రోజులుగా సుమారు 400 వాహనాలు పన్నులు చెల్లించకుండా తిరుగున్నట్లు తమ దష్టికి వచ్చిందన్నారు. వారికందరికీ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి పన్ను చెల్లించాలని కోరినట్లు తెలిపారు. అయినా పెడచెవిన పెట్టి వాహనాలు నడిపితే 200 శాతం జరిమానా విధిస్తామంటూ హెచ్చరించారు.

రోడ్డున పడ్డ 'దశదిన కర్మ'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా దశదిన కర్మ కార్యక్రమాలు రోడ్డున పడ్డాయని టీడీపీ నాయకులు మండిపడ్డారు. గురువారం టీడీపీ నాయకులు గోపాలవనం సమీపంలో ఉన్న కర్మక్రియల మండపం వద్ద నిరసన తెలిపారు. కర్మక్రియల మండపాన్ని సచివాలయానికి వినియోగించడాన్ని నిరసిస్తూ టీడీపీ నాయకులు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. శ్రీకాళహస్తిలో నివసించే హిందూ కుటుంబసభ్యుల మరణానంతరం నిర్వహించుకునే కర్మ క్రతువులకు ఉపయోగపడే కర్మ క్రియల భవనాన్ని ఇతర అవసరాలకు కేటాయించడం కారణంగా దశదిన కర్మ రోడ్డున పడిందని కాసరం రమేష్ అన్నారు. డా.యం.ఉమేష్ రావు, మిన్నల్ రవి, సుబ్బయ్య, వజ్రం కిషోర్, కంఠా రమేష్, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కాకూడదు

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మానవ హక్కులు, సామాజిక అభివద్ధి విభాగం, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో టాటా ట్రస్టు, ఫైజర్ సంస్థల సహకారంతో హెపటైటిస్ బి అండ్ సి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేడు యువత ఎక్కువగా చెడు వ్యసనాలకు లోనవుతున్నారని విద్యార్థి దశలో చదువుపై ఏకాగ్రత చూపి వారు అనుకున్న లక్ష్యం వైపు దృష్టి సారించాలన్నారు. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్థాల రవిబాబు, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం నాయుడు, స్వికా ర్ స్టాఫ్ అమరావతి, అర్చన విద్యార్థులు పాల్గొన్నారు.